క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

కోహెడరూరల్(హుస్నాబాద్): సైబర్‌నేరాలపై ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్‌లో కోహెడ ఎస్‌ఐ అభిలాష్ ఆధ్వర్యంలో మహిళల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, ప్రేమ పెళ్లి అంటూ ఆకర్షణకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి


కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రి ముచ్చాల గ్రామంలోని పలు సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రాజమణికి సీపీఎం పార్టీ నాయకులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా గ్రామంలో చెత్త సేకరణ చేయడం లేదని, దీనికి తోడు వర్షాలు కురిసి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట గ్రామంలో వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని ఆరోపించారు. వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి. గ్రామంలోని చెత్త సేకరణతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, సత్తయ్య, బాలయ్య, బాలరాజు పాల్గొన్నారు.

బీఎల్ఓల శిక్షణపై సమీక్ష


ఆర్పీలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ

హుస్నాబాద్‌రూరల్: యువతకు ఓటు హక్కు కల్పించడానికి బీఎల్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ రాంమూర్తి తెలిపారు. బుధవారం తహసీల్దార్లకు, ఆర్పీలకు ఆర్డీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎలక్షన్ అధికారులు శిక్షణ ఇచ్చారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, మరణించిన వారి పేర్లు తొలగించడం అంశాలపై రెండు రోజుల పాటు బీఎల్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆర్డీఓ రాంమూర్తి అన్నారు. డివిజన్‌లోని మండలాల వారీగా ఆర్పీలు రెండు రోజుల పాటు ఓటరు జాబితాలు సవరణలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ తహసీల్దార్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

మురుగు నీరే.. తాగు నీరు

మిరుదొడ్డి(దుబ్బాక): మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్ లీకై తాగు నీరు కలుషితం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండల పరిధి ధర్మారం గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని 7వ వారులోని ఓ మురికి కూపంలో మిషన్ భగీరథ వాల్వ్ లీకవడంతో మురికి నీరు తాగు నీరుగా సరఫరా అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడం కలుషిత నీరు తాగితే డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధి సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవరించడం సరికాదన్నారు.

మురిపించిన మెహెందీ


మెహెందీ సంబురంలో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె ప్రాథమిక పాఠశాలలో మెహెందీ సంబురం అంబరాన్నంటింది. టీచర్లు, విద్యార్థులు కలిసి బుధవారం మెహెందీ సెలబ్రేషన్‌ను ఉత్సాహంగా జరుపుకొన్నారు. గోరింటాకు మొగ్గతొడిగినట్లు ఎర్రగా పండటంతో చేతులను ఒకరికొకరు చూపించుకుంటూ విద్యార్థులు మురిసిపోయారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అబ్రహం, టీచర్లు ర్యాకం మల్లేశం, హరికృష్ణ, సత్యనారాయణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ స్వరూపా రాణి, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

అద్దె భవనంలో గురుకులం

- స్పోర్ట్స్ భవనంలో కొనసాగుతున్న గురుకులం
- పహరీ నిర్మాణంలో నిర్లక్ష్యం విషజంతువులతో ఆందోళన



స్పోర్ట్స్ స్టేడియంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాల

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లోని బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక స్పోర్ట్స్ స్టేడియం కోసం నిర్మించిన భవనంలో కొనసాగుతోంది. భవనంలో కనీస వసతులు లేవు. ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు కూడా అరకొరగా ఉన్నాయి. గురుకుల పాఠశాల సిద్దిపేట-రామాయంపేట జాతీయ రహదారికి దగ్గరలో ఉండడంతో రోడ్డుపై వెళ్లే పెద్దపెద్ద వాహనాల సౌండ్‌తో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. కొన్ని తరగతి గదులు రోడ్డు వైపున ఉండడంతో వాహనాల శబ్దం తరగతి గదిలోకి వినబడడంతో విద్యార్థులు చదవలేక పోతున్నారు. 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు గురుకుల పాఠశాల స్పోర్ట్స్ స్టేడియంలోనే కొనసాగుతోంది. దీనికి అద్దె రుసుము నెలకు రూ.14వేలు చెల్లిస్తున్నారు. పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదు. దీంతో పాఠశాల ఆవరణలోకి పాములు, తేళ్లు, కుక్కలు వస్తున్నాయి. పాములు రావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సొంత భవనం నిర్మించాలని, ప్రస్తుతం ఉంటున్న పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదు. ప్రహరీ నిర్మించాలని స్పోర్ట్స్ డిపార్టుమెంట్ అధికారులకు విన్నవించినా వారు కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రహరీ లేక పోవడం వల్ల పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు రాత్రి వేళలో పారిపోయే అవకాశం ఉంది. కొంతమంది విద్యార్థులు పారిపోతే వెంబడించి పాఠశాలకు తీసుకువస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే విద్యార్థులు ఎక్కడికి వెళ్లి పోతారోనని భయంతో వేచి చూడాల్సిన పరిస్థితి. గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని, ప్రస్తుతం భవనానికి ప్రహరీ నిర్మించాలని పాఠశాల సిబ్బంది కోరుచున్నారు.


చుట్టూ ప్రహరీ లేని దృశ్యం

> **అద్దె భవనంలో కొనసాగుతోంది..**
>
> 
>
> గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది.. స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ వారికి ప్రతి నెల రూ.14వేలు అద్దె చెల్లిస్తున్నాం. సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ఉంటున్న దానికి ప్రహరీ లేదు. విద్యార్థులు పారిపోతే వెంబడించి పట్టుకొస్తున్నాం. గోడ నిర్మించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. సొంత భవనం నిర్మిస్తే బాగుండు.
>
> – గోపాల్‌రెడ్డి–ప్రిన్సిపాల్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి


ములుగు(గజ్వేల్): జప్తిసింగాయిపల్లిలో భూమి పూజలో పాల్గొన్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ఇల్లు లేని ప్రతీ ఒక్కరి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ములుగు మండలంలోని ములుగు, క్షీరసాగర్, అన్నసాగర్, జప్తిసింగాయిపల్లి, చిన్నతిమ్మాపూర్, తున్కిబొల్లారం, నర్సాపూర్, కొత్తూరు, కొక్కొండ, బండతిమ్మాపూర్, బండమైలారం గ్రామాల్లో లబ్ధిదారులు, పార్టీ నాయకులతో కలసి బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం పేదలకు ఇండ్లు నిర్మించాలన్న సదుద్దేశ్యంతో చేపట్టిన ఈ పథకం నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్త, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. దశల వారీగా ప్రతి ఒకరికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత, నాయకులు రాంరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మూడు మండలాలను కరీంనగర్‌లో కలపాలి

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం


కోహెడలో మాట్లాడుతున్న వెంకటేశం

కోహెడ(హుస్నాబాద్): కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలను కరీంనగర్ జిల్లాలో కలుపాలని.. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు మండలాలను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని.. ప్రస్తుత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని పనులకు సంగారెడ్డి జిల్లాకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జాలిగం రమేశ్, నర్సయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, సాగర్‌రావు, జగన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


విద్యార్థినులతో మాట్లాడుతున్న గరిమా

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. స్టోర్ రూంలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. నాసిరకం కూరగాయలు తీసుకురావద్దని, విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మిని ఆదేశించారు. విద్యార్థినులతో కలిసి ఆమె మధ్యాహ్నా భోజనం చేశారు. అలాగే, ఎల్లారెడ్డిపేటలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు రాధాకృష్ణకు సూచించారు. అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నారాయణరావు, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఏ మల్లయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంఈఓ నర్సయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజలకు సరిపడే నీళ్లు వచ్చేవని, కొద్ది రోజులుగా అరగంట కూడా నీళ్లు రావడం లేదన్నారు. దీంతో ప్రజలు సరిపడ నీళ్లు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, నాగు ముదిరాజ్, నర్సింహ, రాజుగౌడ్, రాజేశ్వర్‌చారి పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

గజ్వేల్‌రూరల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో బీసీల రిజర్వేషన్‌పై మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి అమలులో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్ష కమిటీని ప్రధానమంత్రి వద్దకు తీసుకువెళ్తామని ప్రకటించిన నాయకులు ఎందుకని తప్పించుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయాలని, లేనిపక్షంలో జూలై 17న ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో రైల్‌రోకో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందు, శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

దంప్‌యార్డును వినియోగంలోకి తెస్తాం

మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్


ఏఈకి వీడ్కోలు పలుకుతున్న కమిషనర్, సిబ్బంది

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట పదవవార్డులో నిర్మించిన డంపుయార్డు, డీఆర్‌సీసీ సెంటర్లను అతి త్వరలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ కల్యాణం రమేష్ కుమార్ అన్నారు. బుధవారం డంపుయార్డు, డీఆర్‌సీసీ సెంటర్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపుయార్డులో తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ చేసేందుకు వాటి నుంచి ఎరువుల తయారీకి పారిశుధ్య కార్మికులను నియమిస్తామన్నారు. వారం రోజుల్లో డీఆర్‌సీసీ సెంటర్‌లో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియను చేపడుతామన్నారు. డంపు యార్డులోకి అపరచితులు, చెత్త ఏరుకునేవారు రాకుండా దాని చుట్టూ మెష్‌కేజ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త వాహనంలోనే వేయాలని బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దన్నారు.

ఏఈకి వీడ్కోలు

మున్సిపల్‌లో ఏఈగా పనిచేస్తు బదిలీపై వెళ్తున్న ఏఈ శ్రీకాంత్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే కొత్తగా ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనాథ్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

కిషోర్ నియామకంపై హర్షం

హుస్నాబాద్: ప్రభుత్వం రాష్ట్ర టూరిజం భాష సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నేర్నాల కిషోర్‌ను నియమించడం పట్ల హుస్నాబాద్ ప్రాంత నిరుద్యోగ కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ గీతాలు అనేక పాటలు రాసి ఉమ్మడి రాష్ట్రంలో హుస్నాబాద్, హుజురాబాద్ ప్రాంతాలకు వన్నె తెచ్చిన వ్యక్తి కిషోర్ అని కొనియాడారు. పల్లె నుంచి డిల్లీ వరకు ధూమ్ ధాం కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. సలహా మండలి సభ్యుడిగా కిషోర్‌ను నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 12మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.22,500 జరిమానా విధించారు. వీరిలో ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో జరదేఖో..


రోడ్డు పక్కన చెట్లల్లో నిండిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంప చెట్లల్లో కలిసిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కూరగాయల సాగుపై సూచనలు

ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త మల్లేష్


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లేష్

ములుగు(గజ్వేల్): కూరగాయ పంటల్లో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా.మల్లేష్ సూచించారు. ములుగు మండలం తున్కిబొల్లారం రైతు వేదికలో జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఈఓ) ఆధ్వర్యంలో అధికారులు ఉద్యాన పంటలు వ్యవసాయ పద్ధతులపై రైతులకు బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం ములుగు వ్యవసాయ సంచాలకుడు అనిల్ మాట్లాడుతూ.. కూరగాయల సాగులో రైతులు పురుగుల మందులు వాడుతుండటం వల్ల కలుషితమైన కూరగాయల ఉత్పత్తి జరుగుతుందన్నారు. రైతులు ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను పాటించి నాణ్యమైన కూరగాయలను పండించాలని కోరారు. ఉద్యానశాఖ అందించే బిందు తుంపర సేద్య పరికరాలు, కూరగాయల నారు, రక్షిత సేద్యం పందిర్లు, పామ్‌పాండ్, పండ్ల తోటలకు ఉద్యానశాఖ ద్వారా అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, ఆయిల్‌పామ్ ప్రాముఖ్యత, ఫెర్టిగేషన్ నిర్వహణపై ఉద్యాన అధికారులు సౌమ్య, సుబ్బారావులు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రగతి, జీడిమెట్ల ఉద్యాన అధికారి జలందర్, అనుజ్ఞ, ప్రసాద్ పాల్గొన్నారు.


రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఆదమరిస్తే అంతే..

జదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రం జగదేవ్‌పూర్ నుంచి మునిగడప వైపు వెళ్లే రోడ్డు వద్ద కాళేశ్వరం కాల్వ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జిపై బీటీ వర్షానికి గుంతలు ఏర్పడి నీరు నిలిచి ప్రమాదకరంగా తయారయ్యాయి. నిత్యం ఆ రోడ్డున పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. అదమరిస్తే చాలు క్షణాల్లో ప్రమాదం బారిన పడే అవకాశాలున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళీలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ అండ్ బాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించి తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే షీటీమ్(8712667434), స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్(9494639498), మహిళా పోలీస్‌స్టేషన్ సిద్దిపేట (87126 67435) సమాచారం అందించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ అభివృద్ధి పనులకు భూమిపూజ

హుస్నాబాద్‌రూరల్: మండలం పరిధి పోతారం(ఎస్) ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి బుధవారం భూమి పూజ చేశాడు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. పోతారం(ఎస్) పాఠశాల, అదనపు తరగతుల నిర్మాణానికి రూ.16లక్షల నిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ మంజూరు చేయించారని చెప్పారు.

◆ శ్రీవారి సన్నిధిలో భజన కీర్తనలు

హుస్నాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ పిలుపు మేరకు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం హుస్నాబాద్ పట్టణానికి చెందిన పద్మావతి భజన మండలి సభ్యులు స్వామి వారి సేవలో తరించిపోయారు. తిరుమలలోని అఖండ హరినామ స్మరణ మందిరంలో ఉ.8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు స్వామి పేరున నిర్వహించిన భజనలు, కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను అలరింపజేశాయి.

◆ కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని అంబేడ్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెర్రిపోతుల పరుశురాం అన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని దేశ వ్యాప్తంగా లక్ష పోస్టు కార్డుల ఉద్యమాన్ని గత నెల 23న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభించామన్నారు. ప్రస్తుతం అది కొమురవెల్లి చేరుకుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 500 మంది పోస్టుకార్డులు రాసి పోస్టు బాక్సులో వేశారని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి పిన్నింటి రత్నం, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు మహేశ్, లింగంపల్లి కనకరాజు, బాల నర్సయ్య పాల్గొన్నారు.

◆ మెనూ ప్రకారం భోజనం అందించాలి

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, మద్దూరు మండల ప్రత్యేక అధికారి రాధిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల డైనింగ్ హాల్, వండిన ఆహార పదార్థాలను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంఈఓ వరదరాజులు, మండల వ్యవసాయశాఖ అధికారి బోగేష్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.